## ఎమ్మెల్యే వ్యాఖ్యలకు నిరసనగా జనగామలో ముస్లింల నిరసన



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ ముస్లిం మహిళలు, ముస్లిం సమాజంపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం జుమా నమాజ్ అనంతరం జనగామలోని ఏక్ మినార్ మసీదు వద్ద ముస్లీం డెవలప్ మెంట్ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నిరసన కారులు అరెస్ట్ రాజా సింగ్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి ఆయన తన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినందుకు రాజా సింగ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు, అడ్వకేట్ మహ్మద్ జమాల్ షరీఫ్‌తోపాటు పలువురు ముస్లీం నాయకులు ఆరిఫ్, ఇక్బాల్, మజ్జు, నాహిద్, ఇస్మాయిల్, అఫ్జల్, యువకులు పాల్గొన్నారు.

## భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్



**ప్రజాపక్ష/గణపురం:** గణపురం మండల కేంద్రానికి చెందిన కోలేపాక కావ్య శ్రీ వరకట్న వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో పోలీసులు గురువారం కోలేపాక శంకర్‌ను అరెస్టు చేశారు. కోలెపాక కావ్యశ్రీ తన నివాసంలో అనుమానాస్పద స్థితిలో పురుగుముందు సేవించి గురువారం మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతురాలి సోదరుడు బీరెల్లి సురేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో నా చెల్లి భర్త కోలేపాక శంకర్ నిత్యం మద్యం సేవించి గొడవ పడేవాడు.అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా తీవ్రంగా వేధించేవాడు. ఆ వేధింపులు భరించలేకనే ఆత్మహత్య చేసుకుంది. ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ బి అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు కోలెపాక శంకర్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణ అనంతరం అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరపరిచారు. నిందితుడిప భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్ సెక్షన్లు 85 వరకట్న వేధింపులు, 108 ఆత్మ హత్యకు ప్రేరేపణ, అలాగే వరకట్న నిషేద చట్టం 1961లోని సెక్షన్లు 3, 4 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

## నేడు గుర్రంపేటకు మంత్రి సీతక్క రాక

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**నేడు భూపాలపల్లి మండల పరిధిలోని గుర్రంపేట గ్రామంలో జరగనున్న ప్రజాదర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క నిర్వహించనున్న ప్రజాదర్బార్ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి, మండలం గుర్రంపేట గ్రామంలో రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క నిర్వహించనున్న ప్రజాదర్బార్ కార్యక్రమ ఏర్పాట్లుపై శుక్రవారం అన్ని శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ, పంచాయతి రాజ్ తదితర శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో ప్రజాదర్బార్ కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు దరఖాస్తు దారుల కొరకు ప్రత్యేక కౌంటర్లు, ఇతర అంశాలకు సంబంధించి మరొక కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ములుగు నియోజక వర్గ పరిధిలోకి వచ్చే 5 గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలు వారి వారి సమస్యల దరఖాస్తులు లిఖిత పూర్వకంగా అందచేయాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తుకు తక్షణమే రసీదులు ఇవ్వడంతో పాటు ప్రజావాణి పోర్టల్ లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. కౌంటర్లు వారిగా ఎన్ని దరఖాస్తులు ఏ ఏ విభాగాలకు వచ్చాయో నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ హరికృష్ణ అన్ని శాఖల జిల్లా అధికారులు, భూపాలపల్లి తహసీల్దార్, ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో పర్యావరణ పరిరక్షణ ర్యాలీ




**ప్రజాపక్షం/మహాదేవపూర్;**మండలకేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఎన్‌జిసి ఉపాధ్యాయులు బి ప్రభాకర్ రెడ్డి,మద్దు మధు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ప్రారంభించిన ర్యాలీ గ్రామంలోని వీధుల గుండా చెట్లను పెంచుదాం ప్రాణ వాయువును కాపాడుదాం,ప్లాస్టిక్ వద్దు పర్యావరణం ముద్దు,నీరు పొదుపు చేయండి భవిశ్యత్తును కాపాడండి అంటూ నినాదాలతో నిర్వహించిన ర్యాలీలో గ్రామ సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్,ఎఫ్‌డిఓ సందీప్ రెడ్డి విద్యార్థులు గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్య అతిథులుగా పాల్గొన్న అటవీ డివిజనల్ అధికారి సందీప్ రెడ్డి సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్,మండల విద్యాధికారి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో సమాజం జాగృతం అవుతుందని ప్రతి ఒక్కరూ తమ వంతుగా పర్యావరణం పట్ల బాద్యతగా ఉంటే ప్రకృతి పవిత్రంగా ఉంటుందని అన్నారు.అనంతరం ఎన్‌జిసి ఇన్‌చార్జి, ప్రభాకర్ రెడ్డి,కోఆర్డినేటర్ మద్దు మధు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేద ఒక రోజు కార్యక్రమం కాదని ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి రవి,బాలుర,బాలికల పాఠశాల ప్రధానోపాద్యాయులు అనీల్ కుమార్,సరిత,రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యేుడు అడప రాజయ్య,కార్యదర్శి కల్పన,వార్డు సభ్యులు గ్రామస్థులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## యుఆర్ఎస్‌లో నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/జనగామ :** జనగామ జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్ (యుఆర్ఎస్)లో 202627 విద్యాసంవత్సరం కోసం నాన్ టీచింగ్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయుడు అర్హులైన అభ్యర్థుల నుంది ధరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి సందీప్‌కుమార్ ఝూ తెలిపారు. శుక్రవారం ఆయనొక ప్రకటన చేస్తూ అకౌంటెండ్, అసిస్టెంట్ కుక్,అటెండర్ పోస్టులకు ధరఖాస్తు చేసుకోవాన్నారు. అకౌంటెండ్‌కు వేతనం 14.300 రూపాయలు, అసిస్టెంట్ కుక్, అటెండర్‌కు 9750రూపాయల వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హాతలు, వయసు, అనుభవ దృవపత్రంలో ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్ రోడ్డులోని అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్‌లో ధరఖాస్తులు సమర్పించాలని కోరారు.

# దేశాన్ని సంక్షోభంలోకి నెట్టివేసిన ప్రధాని

మోదీప్రజా వ్యతిరేక విధానాలపై సెప్టెంబర్ 28న చలో ఢిల్లీ* విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/మహబూబాబాద్:**12 ఏళ్ల పరిపాలనలో దేశాన్ని సంక్షోభంలోకి మోదీ నెట్టివేశాడని అన్ని రంగాల్లో విఫలమయ్యాడని, మోదీ చర్యలను నిరసిస్తూ సెప్టెంబర్ 28న లక్షలాది మందితో దేశ రాజధాని ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మహబూబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం వీర భవన్ లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 6 నుండి 14 వరకు మోడీ పెంచిన ధరలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో అధికారమే లక్ష్యంగా మోదీ పని చేస్తున్నారు కానీ రాష్ట్రాల మీద ప్రేమతో కాదని విమర్శించారు. రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను దెబ్బతీస్తున్నారని మొన్న బీహార్‌లో నితీష్ కుమార్ ను దించాడని, ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్ ను దెబ్బతీస్తున్నారు అన్నారు. తెలంగాణలో సిపిఐ ప్రతిష్టను పెంచే లక్ష్యంతో, ఎర్రజండా రెపరెపలాడాలనే ఆశయంతో ఇకనుంచిసిపిఐ మిలిటెంట్ పోరాటాలు చేస్తుందని, గతంలో కమ్యూనిస్టుపార్టీ మిలిటెంట్ పోరాటాలు పునరావృతం చేసి పార్టీని బలోపేదం చేసి ప్రజాసమస్యలపై సమరశంఖం పూరించేలా కార్యచరణ రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సవ్యంగా సాగడం లేదని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి, సిపిఐ జిల్లా సహాయ కార్య దర్శులు బి అజయ్ సారథి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కట్ట బోయిన శ్రీనివాస్, 18 వ వార్డు కౌన్సిలర్ రేశపల్లి నవీన్ పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని




**ప్రజాపక్షం / హనుమకొండ :** వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో చేపట్టనున్న పలు నూతన అభివృద్ధి పనులకు వరంగల్ పశ్చిమనియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ శుక్రవారం ముఖ్యఅథిధిగా హాజరై ప్రారంభించారు. ఈసంధర్భంగా ఎమ్మెల్యేనాయిని మాట్లాడుతూ వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌ను మరింత ఆధునిక సదుపాయాలతో అభివృద్ధిచేసి సభ్యులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.క్లబ్ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని పేర్కొన్నారు.క్లబ్ అభివృద్ధిపూర్తైన అనంతరం సభ్యులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ ప్రథినిధులు సభ్యులు ప్రజాప్రథినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌కు శవయాత్ర..ప్రకృతికి జీవయాత్ర

'జ్వాల' సంస్థ ఆధ్వర్యంలో వినూత్న ర్యాలీ




**ప్రజాపక్షం / హనుమకొండ :** ప్లాస్టిక్ అనర్థా లపై ప్రజల్లో చైతన్యం కలిగించేలా అవినీతి వ్యతిరేక సంస్థ జ్వాల వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.శుక్రవారం ప్లాస్టిక్‌కు శవయాత్ర.ప్రకృతికి జీవయాత్ర పేరుతో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం (జూన్ 5)'సంద ర్భంగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించింది. ఈర్యాలీ వేయి స్థంభాల గుడి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది.ప్లాస్టిక్ వ్యర్థాలతో నిర్వహించిన ఈశవయాత్ర విశేశంగా ఆకట్టకుంది .ఈసందర్భంగా సుంకరి ప్రశాంత్ మా ట్లాడుతూ రోజురోజుకు పెరుగుతన్న ప్లాస్టిక్ వ్యర్థాలతో గాలీ,నీరు,వాయుకాలుష్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలో తడిచెత్త,పొడిచెత్త అని ప్రజలనుంచి సేకరిస్తున్న వాటిని రీసైక్లింగ్ చేసే పరిశ్రమలపై చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు .ప్లాస్టిక్ వినియోగం మనజీవితంలో బాగంగా మారిపోయిందని క్యాన్సర్ లాంటి అనేక ప్రాణంతక వ్యాధులకు ఇదికారణంగా మారిందన్నారు.ప్లాస్టిక్ నిషేదం పై కఠిన చట్టాలు ఉన్నప్పటికీ అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సుంకరి ప్రశాంత్ ఆరోపించారు.కనీసం ప్రభుత్వ శాఖలో అయినా ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈకార్యక్రమంలో ఎల్‌బి కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ సదానందం,జ్వాల సంస్థ సభ్యులు అచ్చే అమర్నాధ్,బుర్రి కృష్ణమూర్తి,ప్రకాష్,గుండపు సాయి చంద్,రవీందర్ కత్తుల రాజు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అరికట్టాలి

తెలంగాణ రైతు కూలీ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** వర్షకాలం సీజన్ ప్రారంభమవుతుందని, రైతులు విత్తనాల కోసం ఎగబడతారని, వ్యాపారులు ఇదే అదునుగా బావించి నకిలి విత్తనాలు జోరుగా తీసుకొచ్చి అమ్మేందుకు యత్నిస్తారని, ఉన్నతాధికారులు నలికి విత్తనాలు అరికట్టాలని, విత్తనాలు బ్లాక్ మార్కెట్ తరలించి అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు కూలి సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ ఉమారాణికి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం వ్యవసాయ సీజన్ ప్రారంభం కాబోతున్నది రైతులు తమ పంట భూములను సదును చేసి విత్తనాలను విత్తుటకు సిద్ధంగా ఉన్నారని, కానీ ఈ వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే ప్రతి సంవత్సరం విత్తన వ్యాపారులు కల్తీ చేసి రైతులను నిలువునా ముంచుతున్నారన్నారు. దానికి తోడు ఏ విత్తనములు అయితే మంచి దిగుబడిని ఇస్తుందో ఆ విత్తనాల ప్యాకెట్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించి, కృత్రిమ కొరతను సృష్టించి, బ్లాక్ విత్తనాలను అమ్ముతూ రైతులను నిలువు దోపిడీ చేయడం జరుగుతుందన్నారు. ప్రధానంగా వరంగల్ జిల్లాలో వరంగల్ పట్టణం, నర్సంపేట కేంద్రంగా చేసుకొని ఈ దళారీ వ్యాపారులు తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారని, దీనికి వ్యవసాయ అధికారులు కూడా సరైన పర్యవేక్షణ కొనసాగించడం లేదని, వెంటనే స్పందించి కల్తీ విత్తనాలు అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు భూమా అశోక్, బర్ల గౌరయ్య, శివరాత్రి కుమార్, బోనగిరి సారయ్య, పిండి బాలకోమురు,అజ్మీరా పులియా, అజ్మీరా శివరామ్, గొర్రె మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా చర్యలు

అదనపు వాహనాలు కేటాయించాలని ఆదేశం

పలు కేంద్రాల్లో కలెక్టర్ సుడిగాలి పర్యటన



**ప్రజాపక్షం/జనగామ :** ధాన్యం సేకరవణలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ అన్నారు. అదనపు వాహనాలు కేటాయించి వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. సరిపడా హమాలీలను సమకూర్చుకోవాలని, ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. శుక్రవారం జనగామ జిల్లాలోని రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి, వెల్ది, ఖిలాషాపురం, మండెలగూడెం, నర్మెట మండలంలోని మచ్చుపహాడ్, నర్మెట, చిల్పూరు మండలంలోని చిల్పూర్, నష్కల్ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు వద్ద ఇప్పటి వరకు సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ఏమైనా ధాన్యం తడిసిందా..ఇంకా ఎంత ధాన్యం ఉంది. కల్లాలో ఇంకా ఉంది అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా .. తూకం సరిగా వేస్తున్నారా.. అదనంగా తీస్తున్నారా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితిలోనూ రైతులకు ఇబ్బందుల లేకుండా కొనుగోళ్లు జరగాలని, ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యత ప్రమాణాలుచూసి తూకం వేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, అదనపు లారీలు, ట్రాక్టర్లు సమకూర్చుకోవాలన్నారు. హమాలీల కొరత లేకుండా చూడాలని, విల్లుల వద్ద సకాలంలో అన్‌లోడింగ్ జరిగేలా చూడాలన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దన్నారు. రైతులు వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు సందర్భంగా ఎలాంటి ఆటంకాలు కలిగించొద్దు అన్నారు. అదనంగా ట్రాక్టర్లు, లారీలు వినియోగించాలని, సాధ్యమైనంత త్వరగా ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. తూకం 41 కేజీలకు మించి వేయరాలని, ఎక్కువ వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాలు కరిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున వెంటనే కొనుగోళ్లుపూర్తి చేయాలన్నారు. అదే విధంగా రఘునాథపల్లి కోమల్లా టోల్‌ప్లాజా వద్ద కలెక్టర్ అకస్మిక తనిఖీ నిర్వహించారు. టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో ఆర్‌డిఒ గోపిరామ్, తహసీల్దార్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని మైసమ్మ ఆలయం, ప్రధాన రహదారి పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హాజరై అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంప కం అత్యంత అవసరమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మొక్కలు నాట డం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో, వర్షపాతం పెరగడంలో మొక్కలు కీలక పాత్ర పో షిస్తాయని అన్నారు. పర్యావరణానికి విఘాతం క లిగితే ఎల్ నినో వంటి వాతావరణ పరిస్థితులు ఏ ర్పడి అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా ప ర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, అటవీ శా ఖ అధికారులు, సిబ్బందిపాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్‌కు భరోసా

కలెక్టర్ సత్య శారద




**ప్రజాపక్షం/ వరంగల్ :** ప్రకృతి సమస్త జీవరాశులకు జీవనాధారమని, ప్రకృతిని కాపాడితేనే అది మనలను కాపాడుతుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా 10 వ థీమ్ లో శుక్రవారం 5 వ రోజున పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఓ సిటీ నుండి జిల్లా అధికారులు స్వచ్ఛంద సంస్థలచే ర్యాలీని నిర్వహించగా జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ థీమ్ అయిన ప్రకృతి నుండి ప్రేరణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహించిన ర్యాలీ అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత వస్తువులను ఉపయోగించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా రోజుకు లక్షల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరణ జరుగు, దీని ప్రభావంతో వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. సునామీలు, క్లౌడ్‌బర్స్టులు, ఇతర విపత్తులు ప్రకృతిపై మానవ జోక్యం వల్లే ఎక్కువవుతున్నాయని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడకుండా గ్రీన్ హైడ్రోజన్ వంటి పర్యావరణహిత ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ పురుషోత్తం గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి నుంచి స్టీల్ బాటిల్స్ వెంట తీసుకు రావడం వల్ల ప్లాస్టిక్ వాడకం తగ్గుతుందని, ప్లాస్టిక్‌ల నియంత్రించడంలో ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ సునీత, రిటైర్డ్ డిఎఫ్ఓ పురుషోత్తం, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పసర పోలీస్ స్టేషన్‌ను డిఎస్‌పి, సిఐ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:**పోలీసు శాఖలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించడం రికార్డుల నిర్వహణను మెరుగుపరచడం లక్ష్యంగా ములుగు డీఎస్పీ పసర సీఐతో కలిసి శుక్రవారం పసర పోలీస్‌స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు తనిఖీబ సందర్భంగా కేస్ డైరీలు స్టేషన్ రికార్డులు వివిధ అధికారిక రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా ఎప్పటికప్పుడు నవీకరిస్తున్నారా అనే అంశాలపై అధికారులు దృష్టి సారించారు స్టేషన్ రిసెప్షన్ విభాగాన్ని పరిశీలించి ప్రజల ఫిర్యాదుల స్వీకరణ పరిష్కార విధానాలను సమీక్షించారు అలాగే అయుధ గదిని తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు ఆయుధాల నిర్వహణ తీరును పరిశీలించారు స్టేషన్ పరిశుభ్రత పరిపాలనా నిర్వహణ ప్రజలకు అందిస్తున్న సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం పాటించాలని ప్రజలకు సత్వర సేవలు అందించాలని సూచించారు సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండి క్రమ శిక్షణతో విధులు నిర్వహించాలని పౌర స్నేహపూర్వక పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు .తనిఖీ సమయంలో పసర పోలీస్ స్టేషన్ సిబ్బంది హాజరై శాంతి భద్రతలు పరిపాలనా అంశాలపై వివరాలు అందించారు ఎస్ఐ ఎస్‌కే తాజుద్దీన్‌కు నిబంధనల అమలు పై ప్రత్యేకంగా ఫాలో అప్ చేయాలని ఆదేశించారు.

## కాంగ్రెస్ హయాంలోనే తండాల అభివృద్ధి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**ప్రజాపక్షం/రాయపర్తి:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజన తండాల అభివృద్ధి సాధ్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మండలంలోని కొండూరు గ్రామ పరిధిలోని భోజ్య తండా, సూర్య తండా నుండి చక్కు తండా, ఏకే తండా గ్రామ పరిధిలోని రాగడి తండా నుండి రావూరుకు ఐటిడిఎ ఆధ్వర్యంలో రూ.5.77 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ గిరిజన తండాల అభివృద్ధికి మౌళిక వస్తువుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ గిరిజన తండాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభు త్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజల రవానా సమస్యలు తగ్గడంతో పాటు విద్య, వైద్యం, ఇతర అవసరాలకు ప్రజలు సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. సూర్య తండా..చుక్కు తండా ప్రాంత ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న ఈ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. కాంట్రాక్టర్‌లు పనులను నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరా రు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపిడిఓ ప్రకాష్, ఐటిడిఎ ఎఇ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మాజీ టిపిసిసి కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్ రెడ్డి, పాల్వంచ కోటేశ్వర్, ఎండి నయిమ్, చెవ్వు కాశినాథం, కాంచనపల్లి వనజరాణి, లకావత్ భాస్కర్, మహేందర్, సర్పంచ్‌లు రాయిని యాకన్న, రెడ్డి నాయక్, బానిషా నాయక్, మహేందర్ రెడ్డి, స్వప్న సంతోష్, సోమా నాయక్, పాల్గొన్నారు.

LOCAL NEWS
స్థానికం
LOCAL NEWS
ఖమ్మం
శనివారం
06-06-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily


## పర్యావరణ పరిరక్షణలో.. ప్రతి పౌరుడూ భాగస్వామి



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్:** జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, అడవులు, జలవనరుల సంరక్షణే ధ్యేయంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్‌లతో కలిసి ఆయన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యతని, నాటిన మొక్కలను సంరక్షించేలా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వ్యవసాయ వ్యర్థాలను పొలాల్లో కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, కరెంటు బిల్లుల భారం తగ్గించుకోవడానికి పీఎం సూర్య ఘర్, కుసుమ్ యోజన సబ్సిడి పథకాల ద్వారా సోలార్ ప్యానెల్స్ అమర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణ పోస్టర్లను విడుదల చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీ సీఈఓ రవి, డీఆర్‌డీఓ రవీందర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భావితరాలకు పచ్చని భవిష్యత్ అందిద్దాం

న్యాయమూర్తి అజయ్ ఉల్లాం



**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** భావితరాలకు పచ్చని, స్వచ్ఛమైన భవిష్యత్‌ను అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ ఉల్లాం అన్నారు. శుక్రవారం సిర్పూర్ (టి) కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన మొక్కల నాటే ఆయన పాల్గొని మొక్కలను నాటారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత వంటి సమస్యల కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, దీనిని కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే సమాజానికి, భావితరాలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. అటవీ శాఖ రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు అటవీ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణకు ముందుకు రావాలని కోరారు. కోర్టు ప్రాంగణంలో నాటిన మొక్కలను సంరక్షించి పెద్ద వృక్షాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ రేంజ్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ఇసుక.. రవాణా చేస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సరైన పత్రాలు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె.హరిత హెచ్చరించారు. శుక్రవారం కాగజ్ నగర్ మండలంలోని కొత్తసార్సాలా గ్రామం వద్ద సార్సాలా వాగు నుండి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను నిలిపి ఆమె అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సరైన అనుమతులు లేకుండా వాగుల నుండి ఇసుకను తరలించడం, చెరువుల నుండి మట్టిని తరలించడం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేదీ నుండి మన ఇసుక వాహన యాప్ ప్రారంభించిందని, ఇసుకను తరలించే వారు యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని అనుమతి పొందాలని స్పష్టం చేశారు. సరైన అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

## మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్ సంధ్య నవీన్‌కుమార్

13వ వార్డు అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి వినతి

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ మున్సిపాలిటీకి బదిలీపై వచ్చిన మున్సిపల్ కమిషనర్ నవీన్ ను పట్టణంలోని 13వ వార్డు కౌన్సిలర్ చెదల్ సంధ్య నవీన్‌కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వార్డులో నెలకొన్న తాగునీటి సరఫరా, మురుగు కాలువల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, అంతర్గత రహదారుల మరమ్మత్తులు, పారిశుధ్య సమస్యలు తదితర అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించాలని కమిషనర్ ను కోరారు. అలాగే 13వ వార్డు సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి, పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని కౌన్సిలర్ చెదల్ సంధ్య నవీన్‌కుమార్ తెలిపారు. వార్డు అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్లు చెప్పారు. వినతి పై సానుకూలంగా స్పందించిన కమిషనర్, సమస్యలను పరిశీలించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ తెలిపారు.



# పారదర్శకమైన ఓటర్ల జాబితాకు రూపకల్పన

బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాను అందించాలి
రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు విధానాన్ని వివరిస్తూ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యలపై కలెక్టర్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలననుసరిస్తూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను అమలు చేసేందుకు అధికార యంత్రాంగం ఎంతో బాధ్యతాయుతంగా పని చేస్తుందని తెలిపారు. మరణించిన వారి పేర్ల తొలగింపు, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని గుర్తించడం, అర్హులైన కొత్త ఓటర్ల పేరును జాబితాలో చేర్చడం కోసమే ఎస్ఐఆర్ అమలు జరుగుతుందన్నారు. ఇప్పటికే నిజామాబాద్ అర్బన్ మినహా మిగతా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90శాతం ప్రీమ్యాపింగ్ పూర్తయిందని, అర్బన్ సెగ్మెంట్‌లో 68 శాతం జరిగిందని వివరించారు. జూన్ 25 నుండి క్షేత్రస్థాయిలో జరగనున్న ఎస్ఐఆర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలని క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన జరపాలని ప్రతి ఓటరు తప్పనిసరిగా మ్యాపింగ్ చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ఈనెల 15 నుండి 24 లోగా బీఎల్ఏలు, బీఎల్ఓలకు ఎస్ఐఆర్ అమలు తీరుపై ఆయా ప్రాంతాల వారిగా శిక్షణా తరగతులను సైతం నిర్వహించాల్సి ఉందన్నారు. అంతేగాకుండా ఓటరు జాబితా విషయమై ఏవైనా అభ్యంతరాలుంటే కేవలం బీఎల్ఓలు మాత్రమే వాటిని తెలియజేయాల్సి ఉంటుందని వారి నుంచే వచ్చే క్లెయిమ్‌లు, అభ్యంతరాలను మాత్రమే స్వీకరించటం జరుగుతుందన్నారు. ఎస్ఐఆర్ షెడ్యూల్ ప్రకారం జూలై 24న పోలింగ్ కేంద్రాలను ఓటర్ల సంఖ్యకనుగుణంగా పునఃవ్యవస్థీకరించటం జరుగుతుందని, జూలై 31న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురిస్తామని వివరించారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు



ముసాయిదా జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అభ్యంతరాలు తెలియజేయవచ్చని అక్కడ సంతృప్తి చెందని పక్షంలో పోం రోజుల అనంతరం జిల్లా ఎన్నికల అధికారికి అభ్యంతరాలు తెలుపవచ్చని సూచించారు. దాఖలైన అభ్యంతరాలు క్లెయిమ్‌లను సెప్టెంబర్ 28 వరకుపరిష్కారం చేస్తామని తెలిపారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు బాలరాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ నియోజకవర్గం పెంబి మండల ఎంపిడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మీ , షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, లబ్ధిదారులకు చెక్కులు అందించిన ఎమ్మెల్యే పేద వారికి అండగా ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించి ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. రానున్న వర్షాకాలంలో గాలి, వాన, పిడుగుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి పర్యావరణాన్ని పరిరక్షణ చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. సర్పంచ్ మల్లెపల్లి సత్యనారాయణ, మండల అధ్యక్షులు, రమేష్, డిసిసి కార్యదర్శి స్వప్నిల్, పుప్పాల శంకర్, ఎంపిడిఓ సుదర్శన్, ఎమ్మార్వో మల్లేష్, అధికారులు, పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కృషి



**ప్రజాపక్షం/మెదక్ :** గ్రామీణ అభివృద్ధి శాఖ 2026–2027 సంవత్సరానికి శాఖ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నూతన మహిళ సంఘాల నమోదు, శ్రీనిధి లోన్స్, ధాన్యం కొనుగోళ్లు,ఇందిర మ్మ చీరలు పంపిణీ, గోదాములు, వ్యవసాయ ఉత్పత్తులు, సోలార్ పంపు సెట్లు, పెట్రోల్ బంకులు, చేయూత పింఛన్లలో లక్ష్యాలు సాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్‌డిఏ పిడి శ్రీనివాస రావు, సరస్వతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### రైతులకు 644.98 కోట్ల చెల్లింపు

మెదక్ జిల్లా లో ధాన్యం కొనుగోలు చివరి దశలో ఉందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శుక్రవారం వరకు జిల్లా వ్యాప్తంగా 76,276 మంది రైతుల నుంచి 3,58,118,040 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 60,349 మంది రైతుల బ్యాంకు ఖాతాలో 644,98 కోట్ల రూపాయలు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. 222 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేసినట్లు పేర్కొన్నారు. ఆధైర్య పడొద్దు అని ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం

కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలు, అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ వేడుకలు శుక్రవారం మామడ మండలం ఆరేపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులందరికీ పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణ కాలుష్యం కారణంగా నేడు పర్యావరణ సమతూల్యత దెబ్బతిని వాతావరణ పరిసితుల్లో ప్రమాదకరమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతూల్యతను కాపాడాలన్నారు. పుట్టినరోజునాడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వివరించారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చడం



వల్ల కూడా పర్యావరణానికి ఎంతో హానీ కలుగుతుందని తెలిపారు. రైతులు పంట వ్యర్థాలకు నిప్పు పెట్టవద్దని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడటమే కా కుండా ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు కారణం అవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయ మార్గాలను పాటించాలని తెలిపారు.పర్యావరణ పరిరక్షణ అనేది తమ తమ ఇంటి నుంచే ప్రారంభం అవ్వాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని ప్రతి ఏడాది అడవులు దగ్ధమవుతున్నాయని, దీని ద్వారా పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని అన్నారు. అడవులు కాలిపోకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి స్థాయిలో నిర్మూలించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రతిజ్ఞ చేశారు. కళాజాత బృందాలు పర్యావరణం పరిరక్షణపై అవగాహన కలిగేలా వివిద కార్యక్రమాలను నిర్వహించారు.జిల్లా ఎస్పీ జానకీ షర్మిల, అటవి అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, సీనియర్ సివిల్‌జడ్జి రవీందర్, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఎప్డీ నాగిని బాను, ప్రతినిధులు,పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని, మనిషి మనుగడ వృక్షాలు నాటడంతోనే ఉంటుందని జిల్లా ఇన్ఛార్జి రెండవ అడిషనల్ ఎస్‌సి ఎస్‌టి కోర్టు న్యాయమూర్తి నారాయణ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు సముదాయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షితః అన్న పెద్దల నానుడి తప్పక పాటించాలని ఈరోజు వాతావరణ సమతుల్యత దెబ్బతినటానికి కారణం విచక్షణా రహితంగా అడవుల నరికివేత అని అన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ నీలకంఠరావు మాట్లాడుతూ చెట్లు నాటడమే ముఖ్యం కాదు, నాటిక ప్రతి చెట్టును పెంచి పోషించాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎక్సైజ్ కోర్టు జడ్జి వి. హరికుమార్, మొబైల్ కోర్టు న్యాయమూర్తి చైతన్య అంగారి, సెకండ్ అడిషనల్ కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస రావు, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎం.సుబాష్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఆవుల నారాయణ రావు, రాజ్‌కుమార్ సుబేదార్, డిఎల్‌ఎస్సి సూపరింటెండెంట్ శ్యామల, డిఎల్ఎస్ఏ సిబ్బంది, పిఎల్‌విలు పాల్గొన్నారు.



## పచ్చదనాన్ని పెంపొందించడం అత్యంత అవసరం

మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజు

**ప్రజాపక్షం/మెదక్ :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందదించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా కేంద్రంలోని మల్లేం చెరువు కట్టమీద నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ , మున్సిపల్ కమిషనర్ నవీన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులతో కలిసి చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు పాల్గొని మొక్కలు నాటారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో పచ్చదనాన్ని పెంపొందించడం అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు.మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు, యువత, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పచ్చని మెదక్ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

## కబ్జా కోరల్లో నిర్మల్ కందకాలు.. ముగింపులో ప్రియదర్శిని నగర్

పడవ ప్రయాణాలే శరణ్యమా ? కాలనీవాసియైన మాజీ మున్సిపల్ చైర్మన్‌పై ప్రజలు ఆగ్రహం

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని పలు వార్డుల్లో కందకాలు, కబ్జాకు గురికాగా, ముఖ్యంగా ప్రియదర్శిని నగర్ కాలనీ రూపురేఖలు వర్షాకా లం వస్తే చాలు పూర్తిగా మారిపోతున్నాయి. ఒకప్పుడు చారిత్రక నగర రక్షణగా ఉన్న కందకం గత పాలకుల ఘోర నిర్లక్ష్యం అండదండలతో కాలక్రమేణా కబ్జాకోరల్లో చిక్కుకుపోయింది. నీరు సజావుగా సాగిపోయే కందకం స్థలాలు అక్రమణలకు గురికావడంతో వర్షపు నీరంతా కాలనీని ముంచెత్తుతోంది. ఫలితంగా ఏటా వర్షాకాలంలో ఈ ప్రాంతం ఒక పెద్ద చెరువును తలపిస్తూ, కాలనీ ప్రజలను నరకయాతనకు గురిచేస్తోంది.ప్రియదర్శిని నగర్ కాలనీలోనే నివసిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మెన్ వైఖరీపై ప్రస్తుతం కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము నిత్యం ఎదుర్కొంటున్న నరకప్రాయమైన సమస్య కళ్ళముందే కనిపిస్తున్నా చారిత్రక కందకం అడ్డగోలుగా కబ్జాకు గురవుతున్నా, ఆయన ఏనాడు పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోతున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కూడా, కనీసం సొంత కాలనీ ప్రజల కష్టాలను తీర్చడానికి గానీ, కందకం ఆక్రమణలను అడ్డుకోవడానికి గానీ ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం, కనీసం పట్టించుకున్న పాపాన పోకపోవడంపై ప్రజలు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### వీధుల్లో పడవల ప్రయాణం, ఇదేనా అభివృద్ధి ?

వర్షాకాలం వచ్చిందంటే చాలు మా వీధులలో నడవాలంటేనే భయమేస్తోంది పరిస్థితి ఎంత ఘోరంగా తయారైందంటే రోడ్లపై మోకాళ్ళకు పైగా నీరు చేరి, నిత్యావసరాల కోసం బయటకు వెళ్ళాలన్నా వీధులలో పడవలు వేసుకొని ప్రయాణించాల్సిన దుస్థితి దాపురించింది. అని కాలనీ ప్రజలు తీవ్ర ఆగ్రహం మరియు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే ఇళ్ళలోకి మురుగునీరు చేరుతోందని, పిల్లలు, వృద్ధులు అంటువ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. గత పాలకుల ఉదాసీనత వల్లే ప్రియదర్శిని నగర్ నేడు ముంపు ప్రాంతంగా మారిందని, ఇప్పటికైన ప్రస్తుత చైర్మెన్ ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఆక్రమణకు గురైన కందకం స్థలాలను స్వాధీనం చేసుకొని, నీటి ఉధృతి సజావుగా సాగిపోయేలా శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## అధికారుల వేధింపులతోనే.. శ్రీధర్‌బాబు ఆత్మహత్య

- నిర్మల్ జిల్లా జెఏసి అధ్యక్షులు రాహుల్‌రాజ్, జనరల్ సెక్రెటరీ వినోద్ కుమార్ ధ్వజం
- తక్షణమే ఉన్నత స్థాయి నిష్పక్షపాత విచారణ జరిపించాలి
- బాధిత కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్
- నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన నిర్మల్ కలెక్టరేట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

**ప్రజాపక్షం /నిర్మల్ కలెక్టరేట్ :** రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ గిరిజన సంక్షేమ శాఖలో ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న వాద్య శ్రీధర్‌బాబు విషాద మరణం పట్ల నిర్మల్ జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసి తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. శ్రీధర్‌బాబు ఆత్మహత్యకు నిరసనగా నిర్మల్ కలెక్టరేట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై తమ నిరసనను తెలియజేశారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదును బట్టి చూస్తే కార్యాలయ సం బంధిత వేధింపులు, తీవ్ర మానసిక ఒత్తిళ్లే ఈ దారుణ ఘటనకు కారణమనే ఆరోపణలు స్ప ష్టంగా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ ఘ టనపై పూర్తి స్థాయి నిష్పక్షపాత విచారణ జరిపి ంచి వాస్తవాలను వెలికితీయాలని వారు డిమాండ్ చేశారు.



### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

శ్రీధర్‌బాబు మరణ ఘటనపై ఉన్నత స్థాయి, లోతైన దర్యాప్తు జరిపించాలని, విధుల్లో వేధింపులకు గురిచేసి ఆయన ఆత్మహత్యకు కారణమైన బాధ్యులైన అధికారులపై కఠిన శాఖాపరమైన మరియు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాహుల్‌రాజ్, వినోద్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే, కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర ఆవేదనలో ఉన్న మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని దాంతో పాటు ఆ కుటుంబంలో ఒక అర్హుడైన సభ్యునికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని వారు కోరారు. ప్రత్యేక పిర్యాదుల పరిష్కార కమిటీని ఏర్పాటు చేయాలి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోరింగ్ ఉద్యోగులపై కొందరు అధికారులు వేధింపులు, మానసిక ఒత్తిళ్ళు, అవమానకర ప్రవర్తన రోజు రోజుకూ మితిమీరిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్ర త్యేక పిర్యాదు పరిష్కార కమిటీని ఏర్పాటు చేయాలని, తద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ గౌరవప్రదమైన, భద్రమైన పని వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. శ్రీధర్‌బాబు కుటుంబానికి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసి తరపున వినమ్రంగా డిమాండ్ చేస్తున్నట్లు రాహుల్ రాజ్, వినోద్ కుమార్ స్పష్టం చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అర్హులకే రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్ర కార్యదర్శి తౌటు సంజీవ్

**ప్రజాపక్షం / జన్నారం :** అర్హులకే రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తౌటు సంజీవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం జన్నారం ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మొదటి విడతలో అర్హులైన పలువురికి ఇళ్లు ఇవ్వకుండా కొందరు అమ్ముకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు స్పందించి రెండో విడతలో నిజమైన అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.

## నేడు ప్రజా సమస్యల.. పరిష్కారానికి వార్డు సభలు

**ప్రజాపక్షం / మందమర్రి :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో మందమర్రి పట్టణంలో శనివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద వార్డు సభలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 7, 8, 9, 10, 11, 12 వార్డుల్లో వార్డు సభలు నిర్వహించబడతాయన్నారు. 7వ వార్డులో దొరల బంగ్లా బస్టాండ్ సమీపంలో, 8వ వార్డులో రామాలయం వద్ద 3వ జోన్‌లో, 9వ వార్డులో రామాలయం వెనుక టవర్ లైన్ ప్రాంతంలో, 10వ వార్డులో వినాయక మండపం వద్ద, 11వ వార్డులో పోచమ్మ ఆలయం సమీపంలో 3వ జోన్‌లో, 12వ వార్డులో పాత విజ్ఞాన్ స్కూల్ సమీపంలోని వినాయక మండపం వద్ద 2వ జోన్‌లో సభలు జరుగుతాయని వివరించారు.

